# హామీలను నెరవేర్చడంలో బీజేపీ విఫలం

- ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న
- బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్, బీజేపీ నేతలు

ఎదులాపురం, నవంబర్ 15 : దేశ ప్రజానీకానికి బీజేపీ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని మళ్లీ ఎన్నికల వేల బూటకపు హామీలతో రాజకీయ పబ్బం గడుపుకునే ప్రయత్నాలు చేస్తోందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న మండిపడ్డారు. పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన చేరికల కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. జైనథ్ మండలం పిప్పరవాడ బీజేపీ వార్డు సభ్యులు, పద్మశాలీ సంఘం మండల ప్రధాన కార్యదర్శి మోరే శ్రీనివాస్‌తో పాటు 50 మంది బీజేపీ , కాంగ్రెస్ పార్టీ నేతలు, అదే విధంగా 48, 49 వార్డులకు చెందిన పలువురు యువకులు ఎమ్మెల్యే అభ్యర్థి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న మాట్లాడుతూ. నల్లధనం వాపసు తెస్తామని హామీ ఇచ్చిన కేంద్రం ఇప్పటికీ నెరవేర్చలేదని, ఉచితంగా గ్యాస్ ఇస్తామని చెప్పి రూ.1200 పెంచిందన్నారు. కేంద్ర పెంచుతున్న ధరలతో సామాన్య ప్రజానీకం ముప్పుతిప్పలు పడుతోందని పేర్కొన్నారు. ఎన్నికల వేళ బూటకపు హామీలు ఇచ్చి వాటిని బుట్టదాఖలు చేయడం బీజేపీకి అలవాటుగా మారిందన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని, బీఆర్‌ఎస్ ప్రభుత్వ పని తీరును చూసే వేలాది మంది యువకులు పార్టీలోకి స్వచ్ఛందంగా చేరుతున్నారని స్పష్టం చేశారు. ఎన్నికల్లో అభివృద్ధి చూసి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, పట్టణ అధ్యక్షుడు అలాల్ అజయ్, ఆత్మ చైర్మన్ రమేశ్, సీనియర్ నాయకులు బొమ్మకంటే రమేశ్, యూనిస్ అక్బానీ, వెనుగంటి ప్రకాశ్, మెట్టు ప్రహ్లాద్, పర్వీన్ సుల్తానా, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటి ప్రచారంలో బీఆర్‌ఎస్ శ్రేణులు



ఎదులాపురం: బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో పత్రాన్ని అందజేస్తున్న వార్డు ఇన్‌చార్జి శౌకత్‌అలీ

ఎదులాపురం, నవంబర్ 15 : పట్టణంలోని మసుద్‌చౌక్, శాంతినగర్‌లో వార్డు ఇన్‌చార్జి శౌకత్‌అలీ, నాయకులు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్నను గెలిపించాలని కోరుతూ బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుపై ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### సుభాష్‌నగర్, టీచర్‌కాలనీలో

ఆదిలాబాద్‌లోని సుభాష్‌నగర్, టీచర్‌కాలనీలో బీఆర్‌ఎస్ మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు స్వరూపారాణి, నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో ఎమ్మెల్యే జోగు రామన్న చేసిన అభివృద్ధి, గెలిచిన తర్వాత వచ్చే సంక్షేమ పథకాలను వివరించారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాయమాటలు నమ్మి మోసం పోవద్దన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి జోగు రామన్నను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి బొడగం మమతా, పట్టణ కార్యదర్శి కరుణ, కార్యకర్తలు సంగీత, సురేఖ, గంగామణి, పర్వీన్, శోభ, తదితరులు పాల్గొన్నారు.

### కాప్రి, లక్ష్మీపూర్ గ్రామాల్లో..



జైనథ్ : కాప్రిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సర్పంచ్ యెల్టి రమీల

జైనథ్, నవంబర్ 15 : మండలంలోని కాప్రి, లక్ష్మీపూర్ గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ యెల్టి రమీలా వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్ దంతెల రవీందర్, మాజీ ఎంపీటీసీ నాయకులు దాసరి ప్రభాకర్, సుభాష్, ఆకుల ఊశన్న, భగత్, భీంరావ్, అశోక్, రాజు పాల్గొన్నారు.

### బీజేపీ, కాంగ్రెస్ పార్టీల డిపాజిట్ గల్లంతు



ఎదులాపురం: బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో పత్రం అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి

ఎదులాపురం, నవంబర్ 14 : ఎన్నికలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల డిపాజిట్ గల్లంతు అవుతుందని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సంజయ్‌నగర్‌లో వార్డు ఇన్‌చార్జి పర్వీన్ సుల్తానాతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో అదిలాబాద్‌లో వేల కోట్లతో అభివృద్ధి జరుగుతుందన్నారు. ఎన్నికలో కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు స్వరూపారాణి, మమతా, మెట్టు ప్రహ్లాద్, కస్తాల ప్రేమల, లక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.

### జన్మదిన వేడుకలు

ఎదులాపురం,నవంబర్15: బీఆర్‌ఎస్ మైనార్టీ సీనియర్ నాయకుడు యూనిస్ అక్బనీ జన్మదిన వేడుకలను బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్నతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, దుర్గం ట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, వార్డు కౌన్సిలర్లు భరత్ కుమార్, నర్సింగ్‌రావు, వెంకన్న, బీఆర్‌ఎస్ నాయకులు రాంకుమార్, గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## బిర్సా ముండాను ఆదర్శంగా తీసుకోవాలి



బిర్సాముండా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న

ఎదులాపురం, నవంబర్ 15 : దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించి ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడిన బిర్సా ముండాను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న అన్నారు. భగవాన్ బిర్సా ముండా జయంతి పురస్కరించుకొని పట్టణంలోని రైల్వే స్టేషన్ ఎదుట గల బిర్సా ముండా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్రోద్యమ సమయంలో ఆ మహనీయుడు చేసిన పోరాటాలు త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ కనీస విద్య, ఆదివాసీ తెగల ఐక్యత కోసం పాటుపడ్డారని పేర్కొన్నారు. బిర్సా ముండా చేసిన పోరాటాలు, త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. ఆ మహనీయుడి ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే పట్టణంలోని బిర్సాముండా విగ్రహానికి పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆంద్ ఆదివాసీ సంఘం అధ్యక్షుడు సురేశ్, ఉపాధ్యక్షులు దత్తు, కిశోర్, సుధాకర్, గిరి నాయకులు సిడాం రాంకిషన్, గేడం మాధవ్, రామారావ్, కృష్ణ, బండారి దేవన్న తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న సాధారణ పరిశీలకుడు గణేశ్ బాపురావ్ పాటిల్

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 15: ఎన్నికల కమిషన్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సాధారణ పరిశీలకుడు గణేశ్ బాపురావ్ పాటిల్ అన్నారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో భారత ఎన్నికల సంఘం నిబంధనలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో పోలీస్ పరిశీలకులు అశోక్ గోయల్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాధారణ పరిశీలకులు మాట్లాడుతూ జిల్లాలో స్నేహపూర్వక వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ సహకారం అందించాలని అన్నారు. పోటీ చేసే అభ్యర్థులు ప్రచార ప్రక్రియలో ఎన్నికల సంఘం నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అభ్యర్థులు ప్రచారం కోసం గోడలపై రాతలు, పోస్టర్లు బ్యానర్లు, సభలు, సమావేశాలు, వాహన ర్యాలీలకు రిటర్నింగ్ అధికారి అనుమతులు పొందాలన్నారు. అలాగే దినపత్రికలు, వివిధ న్యూస్ ఛానల్స్, సోషల్ మీడియాలో ప్రకటనలకై మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ ద్వారా అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రచారంలో భాగంగా వ్యక్తిగతంగా దూషించిన, దుర్భాషలాడిన, నిబంధనలు అతిక్రమిస్తే ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులను సి-విజిల్ యాప్ ద్వారా ఫొటో, వీడియోలు అప్‌లోడ్ చేసినట్లయితే, అట్టి ఫిర్యాదుపై వంద నిమిషాల్లో చర్యలు తీసుకుంటామన్నారు. ప్రచారానికి సంబంధించిన అనుమతులకు సువిధ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకొని అనుమతి పొందవచ్చని అన్నారు. అనంతరం పలువురు రాజకీయ పార్టీల ప్రతినిధులు అడిగిన సందేహాలను కలెక్టర్, పరిశీలకులు నివృత్తి చేశారు. సమావేశంలో శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మొహతో, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సీఎం కేసీఆర్‌తోనే సుభిక్ష పాలన

- ఆసిఫాబాద్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవలక్ష్మి
- నార్నూర్‌లో విస్తృత ప్రచారం



నార్నూర్ మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కోవలక్ష్మి

నార్నూర్, నవంబర్ 15 : సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రంలో సుభిక్షపాలన సాధ్యమని ఆసిఫాబాద్ నియోజక వర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మార్కెట్‌లో వ్యాపారస్తులు, ప్రజలను కలుస్తూ బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోను వివరించారు. హోటల్‌లో మిర్చిబజ్జీలు చేస్తూ ప్రచారం చేశారు. యువకులు, మహిళలు, ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆమె సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2014లో భారీ మెజార్టీతో గెలిపించినట్లు, ఇప్పుడు కూడా నార్నూర్, గాదిగూడ మండలాల ప్రజలు తనను ఆశీర్వదించి, కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నార్నూర్, గాదిగూడ మండలాలకు ఎంతో అభివృద్ధి సాధ్యం చేశామని గుర్తు చేశారు. నేడు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలతో ప్రచారం చేస్తున్నారని, కాంగ్రెస్ గెలిపిస్తే తెలంగాణ రాష్ట్రాన్ని ఢిల్లీకి తాకట్టు పెడుతారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాలకు సమూచిత న్యాయం జరుగుతుందన్నారు. ఆలోచించి ఓటు వేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కనక మోతుబాయి, వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, ఎంపీటీసీ పరమేశ్వర్, సర్పంచ్‌ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ గజానంద్‌నాయక్, మండలాధ్యక్షుడు యుర్వేత రూప్‌దేవ్, సహకార సంఘం ఇన్‌చార్జి చైర్మన్ సురేశ్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ వైస్ మాజీ చైర్మన్ నాగోరావ్, మాజీ జడ్పీటీసీ జ్ఞానోబా పుష్కర్, కోఆప్షన్ సభ్యుడు షేక్ దస్తగిరి, బీఆర్‌ఎస్వీ ఆసిఫాబాద్ నియోజక వర్గ ఇన్‌చార్జి కొరల మహేందర్, ప్యాక్స్ డైరెక్టర్ దుర్గే కాంతారావ్, నాయకులు ఉదయ్‌కాంబ్లే, నర్సింగ్‌మోరే, రాథోడ్ రమేశ్, చంద్రశేఖర్, షేక్ దాదే అలీ, సయ్యద్‌ఖాసీం, ఫిరోజ్‌ఖాన్, మండల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### పుణ్యక్షేత్రం వెళ్లే ప్రయాణికులకు టూర్ ప్యాకేజ్

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 15 :ఈ నెల 25న ఆర్టీసీ ద్వారా తమిళనాడులోని అరుణాచలం గిరి పుణ్యక్షేత్రం వెళ్లే ప్రయాణికుల టూర్ ప్యాకేజ్ ముందస్తు రిజర్వేషన్‌ను ఈ నెల 16 నుంచి ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని ఆదిలాబాద్ డిపో మేనేజర్ కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. ముందస్తు రిజర్వేషన్ కోసం బస్ స్టేషన్ ఆదిలాబాద్‌లో రిజర్వేషన్ కౌంటర్ లేదా www.tsrtconline.inలో రిజర్వేషన్ చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 7382840334 నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.